ఆశలు చిగురించాలని...



కె.గంగవరంలో వరినాట్లతో పొలాల్లో పచ్చదనం



తామరపల్లిలో దమ్ము చేస్తున్న రైతు

- నియోజకవర్గంలో ముమ్మరంగా వరినాట్లు
- విస్తారంగా వర్షాలు కురవడంతో పనులు వేగవంతం
- త్వరగా ముగించాలంటున్న వ్యవసాయాధికారులు

కె.గంగవరం: వర్షాలు విస్తారంగా కురవడంతో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు అంతంత మాత్రం పడడంతో రైతులు నిరాశ చెందారు. వారం రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలు వ్యవసాయానికి మేలు చేకూర్చడంతో.. తొలకరి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 20 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఇటీవల కురిసిన వానలకు చెరువులు, కాలువలు, పంట బోదెలు, ఊట కాలువలు వర్షపు నీటితో నిండిపోయాయి. కోటిపల్లిలోని ప్రధాన కాలువ, కె.గంగవరంలోని టేకి డ్రెయిన్, పామర్రులోని రాజు కాలువలు నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో కురవడం వల్ల వరినాట్లతో పుడమి తల్లికి పచ్చబొట్లు వేసినట్టుగా పచ్చదనంతో పొలాలు ఆహ్లాదంగా మారాయి. కాలువలకు నీరు రావడం, వర్షాలు ప్రారంభం కావడంతో వరినాట్లు మరింత ఊపందుకున్నాయి.

ఆలస్యంగా..

ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎండ తాకిడితో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నెల మొదట్లో కాలువకు నీరు వచ్చినా, వర్షం లేకపోవడంతో సాగు కొంత మేర ఆలస్యమైంది. దీంతో కేవలం రైతులు నారుమడులు వేయడంతోనే సరిపుచ్చుకున్నారు. వర్షాలు కురవడం ప్రారంభం కావడంతో, భట్లపాలిక, పేకేరు, వెల్ల, కాలుజూరు, గొల్లపాలెం తదితర గ్రామాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో ఎక్కువ శాతం రైతులు వరినే పండిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 4,200 హెక్టార్లు, కాజులూరులో 4,500, రామచంద్రపురం మండలంలో 5,046 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు.

బెంగాలీ కూలీలతోనే..

వర్షాలు అధికంగా కురుస్తుండడంతో రైతులంతా ఒక్కసారిగా నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. వీరంతా ఎక్కువగా బెంగాలీ కూలీలపై ఆధార పడుతున్నారు. నాట్లు వేయడానికి ఖర్చు తక్కువ కావడం, వేగంగా నాట్లు వేయడంతో పాటు, ఎకరానికి ఉపయోగించే నారు తక్కువగా ఉండడంతో రైతులు ఎక్కువగా బెంగాలీ కూలీలపై ఆధారపడుతున్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలైన ఎంటీయూ–1318, ఎంటీయూ–7029 రకాలపైనే మక్కువ చూపుతున్నారు. మరో మూడు వారాల్లో వరి నాట్లు పూర్తి కావచ్చని వ్యవసాయాధికారుల అంచనా. వేగంగా వరినాట్లు పూర్తి చేసేందుకు రైతులు కూడా వ్యవసాయ పనులను వేగవంతం చేశారు.

వేగంగా నాట్లు పూర్తి చేయాలి



వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రైతులు వరినాట్లు వేగంగా పూర్తి చేస్తే దిగుబడి అధికంగా ఉంటుంది. ఇప్పటికే ఈ సీజన్ కొంత వరకు ఆలస్యమైంది. రైతులు వరినాట్లు మరింత వేగంగా పూర్తి చేయాలి.

– సద్గురు మూర్తి, వ్యవసాయాధికారి, కె.గంగవరం మండలం

నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు



మొగలిపాలెంలో పెరుగుతున్న నారుమడి

కాజులూరు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం అనుకూలించడంతో రైతులు నారు, నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేయడంతో నిమగ్నమయ్యారు. రెండు వారాల నుంచే నియోజకవర్గంలో అక్కడక్కడా కొందరు రైతులు దమ్ములు చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం అధిక శాతం రైతులు నారుమడుల సిద్ధం చేయడం, విత్తనాల సేకరణ తదితర పనుల్లో బిజీగా ఉన్నారు. నాట్లు ఆలస్యమైతే, పంట ఆలస్యమై తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, తద్వారా తొలకరి సాగు ఖర్చు అధికమవుతుందని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. నారుమడులు తయారుచేసుకోని రైతులు వెదజల్లు విధానాన్ని అవలంభించటం శ్రేయస్కరమన్నారు. రైతులు జూలై నెలాఖరుకు నాట్ల పనులు పూర్తిచేయడం మంచిదన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ఇలాఉండగా, తొలకరి సాగుకు పెట్టుబడికి డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మొగలిపాలేనికి చెందిన రైతు నల్లమిల్లి అచ్చిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుకావడం లేదని చెప్పారు.

మోసాలతోనే ఏడాది పూర్తి

- ప్రశ్నిస్తున్న వారిపై కేసులు
- పోరాడుతున్న వైఎస్సార్ సీపీపై అసంబద్ధ వ్యాఖ్యలు
- సుపరిపాలన పేరుతో సొంత భజన
- కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజం



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు గ్రామాల్లో పర్యటించడం హాస్యాస్పదంగా ఉందని, ఏడాది పాలనంతా మోసాలతో సాగిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కత్రి పాపారాయుడు, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల నాయకులతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని, వచ్చాక ఏడాది పాలన మోసాలతో సాగిందన్నారు. సంక్షేమం పేరుతో ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ప్రజలు కోసం ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందన్నారు. సూపర్ సిక్స్‌లో మూడు అమలు చేసేశామని, అది వైఎస్సార్ సీపీ నాయకులకు కళ్ల కనిపించడం లేదేమోనంటూ కూటమి ప్రజాప్రతినిధి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విపక్ష నాయకులకు కళ్ల కనపించడం లేదా అని అన్న కూటమి నేత ముందస్తుగా తనకు మతి ఉండి మాట్లాడుతున్నారా ?లేదా ? అన్నది సరిచూసుకోవాలని ఎద్దేవా చేశారు. సుపరిపాలన అన్న పేరు పెట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్న వారు ఏపాటి సంక్షేమాన్ని అమలు చేసేసేరో వారి పార్టీ కార్యకర్తలను అడిగినా వాస్తవాన్ని గ్రహించవచ్చన్నారు.

వాళ్ల ఇళ్లకు వెళ్లే ధైర్యం ఉందా ?

తల్లికివందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాల సాయం అందని వారి ఇంటికి వెళ్లే ధైర్యం కూటమి నేతలకు ఉందా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదన్న వాస్తవాన్ని కప్పి పుచ్చుకోవడానికి కూటమి ప్రభుత్వం నానా అవస్థలు పడుతోందన్నారు. ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ ప్రశ్నిస్తున్న తీరు, చేస్తున్న పోరాటాలకు కూటమి నేతలు అసహనం వ్యక్తం చేస్తూ లేని పోని నిందారోపణలతో కాలం వెల్లదీస్తున్నారన్నారు. ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలు గమనించారని, సరైన బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. 68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో బిల్లులు చెల్లించినట్లు చెప్పడం ప్రభుత్వ అబద్ధాలకు నిదర్శనమన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ధాన్యం డబ్బులు కోసం చేస్తున్న ఆందోళన కూటమి నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేల సాయం కోసం రైతులు, రూ.3 వేలు చొప్పున ఏడాదికి రూ.36 వేలు భృతి కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. కల్పిస్తామన్న 20 లక్షల ఉద్యోగాలు ఏ సంస్థల్లో ఇప్పిస్తారో స్పష్టం చేయాలన్నారు. ఇవన్నీ ప్రజలకు ఇంకా ఇవ్వలేదన్న విషయం కూటమి నేతల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కత్రి పాపారాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు విధులకు దూరమయ్యారన్నారు. సచివాలయ ఉద్యోగులపై భారం పెరిగిందన్నారు. చిరుద్యోగులైన అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, ఎంపీటీసీ సభ్యురాలు గొల్లపల్లి సోనియా, నియోజకవర్గ ఐటీ వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, నాయకులు యర్రగుంట అయ్యప్ప, మేడిశెట్టి దుర్గారావు, కట్టా మురళీ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి

కపిలేశ్వరపురం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో అందుబాటులోకి వచ్చిన సామాజిక మాధ్యమాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి సూచించారు. అంగర పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీసిద్ధార్థ జూనియర్ కళాశాలలో గురువారం మహిళలు, బాలికల రక్షణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్తి మాట్లాడుతూ సిలబస్ పుస్తకాలతో పాటు సమాజంలోని ప్రతి అంశాన్ని విద్యార్థినులు అధ్యయనం చేయాలన్నారు. విద్యార్థులు సామాజిక పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే ప్రతి పోస్టు తెలిసి చేసినా, తెలియక చేసినా తలెత్తే సమస్యకు బాధ్యత వహించాల్సి వస్తుందని గుర్తించాలన్నారు. రోజులో అధిక సమయాన్ని చదువు కోసం కేటాయించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సంబంధిత నంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందివాలని సూచించారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు మాట్లాడుతూ గృహ హింస, వరకట్నం సమస్యలు ఎదుర్కొంటున్నవారు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు, అత్యవసర సేవలకు 112, మహిళా వేధింపులు, అక్రమ రవాణ సమాచారం ఇచ్చేందుకు 1091, సైబర్ నేరాలకు 1930, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, రవాణా జరిగితే 1972 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్సై హరీష్‌కుమార్, శ్రీసిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వర, కరస్పాండెంట్ వి.రాజా, చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, ప్రిన్సిపాల్ పి.రమణ, మహిళా పోలీసులు ఎం.భవాని, విజయలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న డీఎస్పీ ప్రదీప్తి, పోలీసులు



తిరుమల ఎక్స్‌ప్రెస్ బోగీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి నేతృత్వంలోని బృందం రైల్వే స్టేషన్ ప్రాంగణం, తిరుమల ఎక్స్‌ప్రెస్ బోగీల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా గంజాయి, మాదక ద్రవ్యాల తరలింపును నిలువరించే లక్ష్యంతో ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో తనిఖీలు చేసినట్టు డీఎస్పీ ప్రదీప్తి తెలిపారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు, రూరల్ ఎస్సై, జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్‌సెల్ బృందం, డాగ్ స్క్వాడ్ విశాఖపట్నం నుంచి తిరుపతి వెళ్తున్న 18521 నంబర్‌గల తిరుమల ఎక్స్‌ప్రెస్ బోగీలను మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. ద్వారపూడి నుంచి రాజమహేంద్రవరం స్టేషన్ వరకూ తనిఖీలను కొనసాగించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎస్ ఉదయభాస్కర్ తెలిపారు. గురువారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ వీర్రెడి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్‌లో భాగంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు. కాజులూరు సబ్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, అయితపూడి, తిప్పరాజుపాలెం, ఒంటితాడి, పల్లిపాలెం, శీల తదితర గ్రామాలకు, గొల్లపాలెం 11 కేవీ ఫీడర్ ఏరియాలోని కాజులూరు మండలంలో బందనపూడి, మొగలిపాలెం, చీకట్ల వారిపేట, మతుకుమిల్లి, తర్లంపూడి, టి మామిడాడ, చేదువాడ తదితర గ్రామాలకు, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందన్నారు. గృహాలతో పాటు, ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు.

మండపేటలోని పలు ప్రాంతాల్లో..

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం ఏడిద కొత్తూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణంలోని ఏడిద రోడ్డు, బైపాస్ రోడ్డు, సంఘం కాలనీ, రాజీవ్ గృహకల్ప, మెహర్ బాబా ఆశ్రమం, విజయలక్ష్మి నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పలు దఫాలుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రత్నాలరావు తెలిపారు.

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరులో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. అంగర విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గణపతి

అమలాపురం రూరల్: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైయింది. 2025–2026 సంవత్సరానికి అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పేరూరు కొంకాపల్లి చెందిన సుదా గణపతి ఎన్నికయ్యారు. శనివారం అమలాపురం లయన్స్ క్లబ్ హాలులో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరుగుందని ప్రస్తుత అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా చిక్కాల సతీష్, గోకరకొండ నాగేంద్రరావు, కార్యదర్శిగా బెహరా వీర హనుమంతరావు, కోశాధిరిగా గుత్తుల నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా సుగ్గు సత్య గోపాల కృష్ణ కుమార్, జాయింట్ ట్రెజరర్‌గా పట్నాల వెంకటరమణ, ఐపీపీఎల్‌సీఎఫ్ రవణం వేణుగోపాలరావు, ఇతర కమిటీ సభ్యులు 15 మంది ఎన్నికయ్యారు. ఈ ప్రమాణ సీకార మహోత్సవానికి ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులైన గణపతి కార్మిక ఉద్యమాల్లో ముందుండే వారు. వెఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు ప్రధాన కార్యర్శిగా పని చేసి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాలక్ష్మి

ముమ్మిడివరం: మహిళలు కుటుంబ నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తారని జిల్లా బాలల పరిరక్షణ అధికారిని బి.ఉమాలక్ష్మి అన్నారు. బెంగులూరుకి చెందిన ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో కార్లి మ్యాట్ సిస్టర్స్ ఆఫ్ తెరిసా, పీపుల్స్ సర్వీష్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కర్నీడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగం ద్వారా సమాన వేతనాలు, వెటర్నెటీ హక్కు, గృహ హింస, లైంగిక వేధింపుల నుంచి నిరోధనాలు, ఆస్తి వారసత్వ హక్కు లభించిందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఐఎస్ఐ కోఆర్డినేటర్ కోఆర్డినేటర్ జి.కరుణాకరరావు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంపై అలసత్వం తగదు

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కిరణ్, లక్ష్మీరెడ్డి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కమిషన్ సభ్యులు

కె.గంగవరం: విద్యాసంస్థల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై అలసత్వం తగదని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్, లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలోని కోటిపల్లి, కె.గంగవరం, సుందరపల్లి అంగన్‌వాడీ సెంటర్లతో పాటు, పామర్రు, సుందరపల్లి ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను గురువారం వారు పరిశీలించారు. కోటిపల్లి అంగన్‌వాడీ సెంటర్ తనిఖీలో లోపాలను గుర్తించారు. సూపర్‌వైజర్ పర్యవేక్షణ లేకపోవడంతో, టీచర్, సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సిఫారసు చేశారు. పామర్రు ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు రుచిగా, శుచిగా మధ్యాహ్న భోజనాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట ఎంఈఓ–2 ఆంజనేయులు, ఏడీ ఎస్.సురేష్ ఉన్నారు.

ఘనంగా క్రైస్తవ దినోత్సవం



సీనియర్ పాస్టర్‌ను సత్కరిస్తున్న ఫెలోషిప్ సభ్యులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ, పరిసర ప్రాంతాల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో ద్రాక్షారామ మండాలమ్మపేట ఎన్‌టీసీ జీసస్ చర్చిలో గురువారం భారతదేశ క్రైస్తవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాస్టర్లను సత్కరించారు. తవిటికి విజయకుమార్ వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, ఫెలోషిప్ అధ్యక్షుడు టి.కృపానందం, గౌరవాధ్యక్షుడు పీఎస్ జేసుపాదం, కార్యదర్శి పి.విజయరత్నం, చైర్మన్ జి.సత్యానందం, వైస్ ప్రెసిడెంట్ వీఎస్ ప్రసాద్, నక్కా సతీష్‌బాబు, కె.ఆనందకుమార్, కోశాధికారి జి.మోషే, వి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



వెదురుపాకలో బాధిత కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: మండలంలోని వెదురుపాక ఎనిమిదో అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన గేలం సుబ్బలక్ష్మి కుటుంబానికి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. రాయవరం మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు డి.ఆదిలక్ష్మి, ఎస్.కృష్ణకుమారి, సీహెచ్.సత్యవేణి చేతుల మీదుగా 50 కేజీల బియ్యం, నిత్యావసరాలు, రూ.2 వేలు నగదును మృతురాలి భర్త గేలం పోలీసు, కుమారుడు హనుమంతురావు, కోడలు సురేఖకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.బాలత్రిపుర సుందరి, ఎస్.శ్రీసత్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

లంకకు చైర్‌పర్సన్ దుర్గారాణి పరామర్శ



మండపేట ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మండపేటలోని సాయి ఆర్థో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త లంక అబ్రహంను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి వైద్యం అందిస్తున్న తీరుపై వైద్యులతో మాట్లాడారు.

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్రగుంట అయ్యప్ప, దుగ్గిరాల చిన్న, పందిరి బాబి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



గాయపడిన వృద్ధురాలిని తన వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఇప్పనపాడు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండపేట పట్టణం రావులపేటకు చెందిన వృద్ధురాలు గరగ సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామం మీదుగా మండపేట పట్టణానికి వెళ్తున్న రూరల్ సీఐ పి.దొరరాజు గుమిగూడిన జనాన్ని చూసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. తలకు గాయం కావడంతో తీవ్ర రక్తస్రావంతో వృద్ధురాలు అవస్థ పడటాన్ని చూసి సీఐ దొరరాజు తన వాహనంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత మహిళ వైజాగ్ నుండి రైలులో ద్వారపూడి వచ్చారు. అక్కడ నుంచి మండపేటకు ఆమె మనుమడు తరుణ్ మోటార్ సైకిల్‌పై తీసుకెళ్తున్నాడు. ఇప్పన పాడులోని రైస్‌మిల్లు వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో బైక్‌పై నుంచి రోడ్డుపైకి పడటంతో సత్యవతి తలకు గాయమైంది. ఆసుపత్రిలో వైద్యులు చికిత్స చేయగా సత్యవతి కోలుకొంటోంది.

ఘనంగా మోటార్ మెకానిక్‌ల దినోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని భీమేశ్వరస్వామి మోటార్ సైకిల్ మెకానిక్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మోటార్ సైకిల్ మెకానిక్‌ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేశారు. తమను సంఘటిత కార్మికులుగా గుర్తించాలని, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సంఘ బిల్డింగ్ నిర్మించాలని మంత్రి సుభాష్ తండ్రి సత్యానికి వినతిపత్రం అందించారు.

ఏడిద హైస్కూల్ ఔన్నత్యాన్ని కాపాడుతాం



హెచ్‌ఎం జయలక్ష్మికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాల ఔన్నత్యాన్ని కాపాడుతామని పాఠశాల హెచ్‌ఎం చింతా జయలక్ష్మి అన్నారు. ఆమె పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నూతన హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఆమెకు ఉపాధ్యాయులు స్వాగతం పలికి సత్కరించారు. ఎస్ఎంవీ ఎక్స్ అఫీషియో సభ్యుడు, రిటైర్డ్ హెచ్‌ఎం గెడా శ్రీనివాస్, సభ్యులు, రామచంద్రపురం ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ముంగర వెంకటరాజు, పీఈటీ సిద్ధాంతపు వీర్రాజు మాట్లాడుతూ ఏడిద పాఠశాల ప్రత్యేకతను వివరించారు. అనంతరం పాఠశాలలో చేరికలు, వార్షిక ప్రగతి లక్ష్యం తదితర అంశాలపై చర్చించారు.

జీసస్ ప్రేమతో ప్రశాంత జీవనం



తాపేశ్వరంలో ఎమ్మెల్యే వేగుళ్లకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): జీసస్ ప్రేమతో ప్రశాంత జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తాపేశ్వరంలోని జీసస్ క్రిస్ట్ గ్లోరీ చర్చిలో గురువారం పాస్టర్స్ ఫెల్లోషిప్ జిల్లా అధ్యక్షుడు డా.డేనియల్ పాల్ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకను నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్లను మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల పాస్టర్స్ ఫెల్లోషిప్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని క్రైస్తవ భక్తులు, ప్రబోధకులు పాల్గొన్నారు.

ఘనంగా రుగ్వేద పారాయణ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులో వేంచేసిన అగస్త్యేశ్వరస్వామి సన్నిధిలో గురువారం రుగ్వేద సంహిత పారాయణ ఘనస్వస్తి కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనం అందజేశారు. స్వామివారికి అష్టోత్తర శతనామ పూజ చేశారు. పండితులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు చేబ్రోలు దిలీప్‌కుమార్, పండితులు, గ్రామ నాయకుడు నల్లమిల్లి వీర్రెడ్డి పాల్గొన్నారు.



అర్తమూరులో సత్కారం అందుకుంటున్న పండితులు